



కురుమూర్తివాసా గోవిందా

అమావాస్యను పురస్కరించుకొని కురుమూర్తిస్వామి దర్శనానికి భక్తులు తరలివచ్చారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 41.6 /24.8

ఉదయం ఉంచే ఎండ ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు బలంగా వీస్తాయి. ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ఆదిశిలా క్షేత్రంలో అమావాస్య ప్రత్యేక పూజలు



మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం అమావాస్యను పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు, అలాగే అన్నదానం చేశారు. ఆలయచైర్మన్ ప్రహ్లాదరావు, అర్చకులు మధుసూదనాచారి, రవిచారి పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు ఏడు అర్జీలు

గద్వాల క్రైం: సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ఫిర్యాదుల దినోత్సవానికి ఏడు ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ రితిరాజ్ తెలిపారు. వాటిలో పొలం బాట, ఆస్తి పంపకాలు, అక్రమంగా భూమి రిజిస్ట్రేషన్, భార్యభర్తల తగదాలు, ప్రేమ వివాహం చేసుకున్న జంటకు భద్రత కల్పించాలంటూ పలు ఫిర్యాదులు ఉన్నాయన్నారు. సివిల్ తగదాలు కోర్టు ద్వారా పరిష్కారం చేసుకోవాలని, మిగతా ఫిర్యాదులను విచారణ చేపట్టి తగు చర్యలు చేపడతామని ఎస్పీ వివరించారు.

13న వామపక్షాల సదస్సు

అలంపూర్: పట్టణంలో ఈ నెల 13న వామపక్షాల జిల్లా సదస్సు నిర్వహించనున్నట్లు, అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రాజు అన్నారు. శనివారం కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం ఏడు విడతల్లో ఎన్నికలు నిర్వహించడం తగదని, ఒకే విడతలో అన్ని ఎన్నికలు పూర్తి చెయ్యాలని డిమాండ్ చేస్తు సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. భిన్నత్వంలో ఏకత్వంలో అన్ని మతాలను సమానంగా చూసే ఈ కాలంలో సీఏఏ చట్టం ద్వారా ముస్లింలను వేరుగా చూస్తుండడంతో వారు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఎవరైన ప్రశ్నిస్తే ఈడీ కేసులంటూ జైలుకు పంపుతున్నారని, ఓటు ద్వారా బీజేపీకి బుద్ధిచెప్పాలన్నారు. నరసింహ, ఆశన్న, మాలిక్ భాషా, రఫీ పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తప్పనిసరి

గద్వాల రూరల్: వేసవి ఎండలు భగ్గుమంటున్న నేపథ్యంలో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించేలా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అపూర్వ్‌చౌహాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన ఐడీవోసీ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉష్ణోగ్రతలు గరిష్టంగా పెరిగిపోతుండడంపై ప్రజలకు తగిన జాగ్రత్తలు సూచనలు అందిస్తూ వారికి అవగాహన కల్పించాలన్నారు. దీనిపై ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా వడదెబ్బ సోకిన వారికి తక్షణమే అవసరమైన వైద్యం అందించేందుకు అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ శశికళ, అదనపు ఎస్పీ గుణశేఖర్, ఆర్డీవో రాంచందర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఒకేషనల్ పరీక్షకు సంబంధించి మొత్తం ఐదు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఏఎస్పీ గుణశేఖర్, డీఈవో ఇందిరా, నోడల్ అధికారి హృదయరాజు పాల్గొన్నారు.

ఉగాది.. ఉషస్సు

శోభకృత్‌కు వందనం.. ఆశల క్రోధినామానికి ఆహ్వానం



గద్వాలలో పూలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

- జిల్లాలో ఆలయాల ముస్తాబు
- పంచాంగ శ్రవణానికి ఏర్పాట్లు
- కొనుగోలుదారులతో సందడిగా మార్కెట్లు

గద్వాల: ఎన్నో అనుభూతుల్ని పంచిన శ్రీశోభకృత్ నామ సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ.. మరెన్నో ఆశలతో జిల్లా ప్రజలు శ్రీక్రోధినామ సంవత్సరానికి స్వాగతం పలకడానికి సిద్ధమయ్యారు. తెలుగు వారి నూతన సంవత్సరమైన ఉగాది పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా ఉగాది సందడి కొట్టొచ్చినట్లు కనిపించింది. చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు సోమవారం గద్వాలకు వచ్చి పండగ వస్తువులు కొనుగోలు చేశారు. దీంతో గద్వాల పాతబస్టాండ్, రథశాల, కూరగాయల మార్కెట్, గాంధీ చౌక్ తదితర ప్రాంతాలన్నీ కొనుగోలు దారులతో కిక్కిరిసింది. గద్వాలతో పాటు అయిజ, శాంతినగర్, అలంపూర్ పట్టణాలలో సైతం ఉగాది హడావుడి కనిపించింది.



ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు..

ఉగాదిని పురస్కరించుకొని స్థానికంగా ఉన్న ఆలయాలలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా జిల్లా కేంద్రంలో సుంకులమ్మ, ఈదమ్మ ఆలయాల వద్ద భక్తులు నైవేద్యాలు సమర్పిస్తారు. సాయంత్రం ప్రత్యేకంగా పంచాంగం శ్రవణం కోసం ప్రజలు ఆసక్తి కనబర్చుతారు. మండల కేంద్రాలతో పాటు జిల్లా కేంద్రంలోని మార్కెడేయస్వామి ఆలయం, అహోబిల మఠం, శ్రీకన్యకా పరమేశ్వరి ఆలయం, నది అగ్రహారంలోని ఆలయాల దగ్గర పంచాంగం శ్రవణం నిర్వహించనున్నారు. ముఖ్యంగా జిల్లాలో ప్రసిద్ధ పుణ్య క్షేత్రాలైన అలంపూర్, బీచుపల్లి, మల్దకల్, పాంగుంట తదితర ఆలయాలలో పంచాంగ శ్రవణం నిర్వహించనున్నారు.

మార్కెట్లు కిటకిట

జిల్లా కేంద్రంతోపాటు మండల కేంద్రాలు పూల మార్కెట్లు, దుకాణాలు కొనుగోలు దారులతో సందడిగా మారాయి. ఉదయం మందకొడిగా సాగిన విక్రయాలు సాయంత్రం ఒక్కసారిగా ఊపందుకోవడంతో వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు. మామిడి కాయాలు, ఇస్తరాకులు, బంతిపూలు, టెంకాయాల కొనుగోళ్లకు డిమాండ్ నెలకొంది. మార్కెట్‌తో పాటు ప్రధాన చౌరస్తాలలో పూల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసి అమ్మకాలు జరిపారు. పూలు, పండ్లు, కూరగాయల ధరలు కొండెక్కి కూర్చున్నా కొనుగోలు దారులు ఏ మాత్రం రాజీ పడలేదు. మామిడి తోరణాలు పెద్దమొత్తంలో తీసుకొచ్చి అమ్మకాలు జరిపారు. ఉగాది పండగను పురస్కరించుకుని పలు ప్రాంతాలలో ఎద్దుల బండలాగుడు పోటీలను నిర్వహించడానికి రైతులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.



మామిడాకులు కొనుగోలు చేస్తూ..

వ్యవసాయ పనులకు శ్రీకారం..

ఉగాది పండుగ అంటేనే కొత్త పనులకు శ్రీకారం చుట్టే ఆనవాయితీ. ముఖ్యంగా రైతులు చైత్ర పాడ్యమిని శుభదినంగా భావించి ఖరీఫ్ పంటకు శ్రీకారం చుడతారు. వ్యవసాయంలో ప్రధాన పాత్రపోషించే పశువులకు ముకుతాడు వేయిస్తారు. భూమిపూజ చేసి అరక తిప్పుతారు. పొలంలో షమీ వృక్షానికి పూజలు చేసి వ్యవసాయ పరికరాలకు పూజలు చేస్తారు. పెరుగన్నం నైవేద్యంగా సమర్పిస్తారు. చివరికి అరక పట్టి ఐదుసార్లు దుక్కి దున్నుతారు.

భవిష్యత్‌పై అప్రమత్తత.. పంచాంగం

ఉగాది రోజున సాయంత్రం వేళ ఆలయాల్లో, గ్రామకూడలిలో పంచాగ పఠనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. పంచాంగం పూర్వకాలంనుంచి ఒక శాస్త్రంగా భావిస్తూ వస్తున్నారు. గ్రామ పురోహితుడు హాజరై గ్రామ పెద్దలు, పురప్రముఖుల మధ్య పంచాంగం వివరాలను చదివి వినిపిస్తారు. పంచాంగం రానున్న ఏడాది కాలంలో వ్యక్తుల వ్యక్తిగత ఆదాయ, వ్యయాలు, పోకడలతో పాటు దేశప్రాంత సామాజిక పరిస్థితులు, వాతావరణం వంటి విషయాల్లోనూ అప్రమత్తం చేస్తుంది. వర్షాలు, కరవు కాటకాలు, అరిష్టాల గురించి ఇందులో వివరిస్తారు. నమ్మకాన్ని బట్టి ఈ వివరాలను విశ్వసిస్తారు. తిథి, వార, నక్షత్ర, యోగ, కరణం అనే ఐదు అంశాలతో కూడిన పంచాంగ పఠనం వింటే సంపద, ఆయుష్షు, పాపపరిహారం, రోగాలు తొలగడం, చేసే ప్రయత్నాలు ఫలించడం వంటి ఐదు ప్రయోజనాలు చేకూరుతాయని చెబుతారు.

ఆకట్టుకునే కవి సమ్మేళనం..

పంచాంగ పఠనం తర్వాత నిర్వహించే కవి సమ్మేళనం ఆకట్టుకునేలా ఉంటుంది. 'హితేన సహితం సాహిత్యం' అంటారు. మేలుచేసేదే సాహిత్యం అని అర్థం. వసంతరుతువు కావడంతో లేత చిగుళ్లు తిన్న కోయిలలు మాధుర్యంతో కూసే కూత కవిలో కొత్త ఆలోచనలు కలిగిస్తుంది. ఈ సమ్మేళనాల్లో ఔత్సాహిక కవులు జనహితం కోరుతూ రచించిన కవితలను షడ్రుచులతో పాటు మాతృబాషపై మాధుర్యాన్ని జోడించి ఇందులో చదివి వినిపిస్తారు. ఇలాంటి కవి సమ్మేళనాలకు చిన్నారులను తీసుకెళ్లడం వల్ల వారికి మాతృభాషపై మరింత అవగాహన పెరిగే వీలుంటుంది. కవితా రచనప్రక్రియపై అవగాహన పెరుగుతుంది. ఇతరభాషల పట్ల మోజుతో ఉన్న వారికి సైతం మాతృభాషపై ఆసక్తిని కలిగిస్తుంది. కవితల రూపంలో తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ముందు తరానికి పరిచయం చేయొచ్చు.

తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి శృతిఓఝా, పక్కన కలెక్టర్ బీఎం సంతోష్

- నీటికొరత ఉన్న ప్రాంతాల్లో బోర్లు, ట్యాంకర్ల ద్వారా సరఫరా
- ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి శృతిఓఝా

గద్వాల రూరల్: జిల్లాలో తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి శృతిఓఝా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లాకు వచ్చిన ఆమెకు కలెక్టర్ బీఎం సంతోష్ స్వాగతం పలికారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారులతో తాగునీటిపై సమీక్షించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక దృష్టిసారించి ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా అన్ని జనవాసాలకు ప్రతిరోజు తాగునీరు క్రమం తప్పకుండా సరఫరా అయ్యేలా అధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. నీటికొరత ఉన్న ప్రాంతాలలో బోరు మోటార్లు, ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టాలన్నారు. మండల స్థాయి అధికారులందరూ ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో సమన్వయం చేసుకుని నీటిసమస్యలు ఏర్పడకుండా చూడాలన్నారు. ఈసందర్బంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న నీటివనరులు, లభ్యత, తాగునీటి సరఫరా డిమాండ్ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడైన పైపులైన్‌లీకేజీలు, చేతిపంపులు, బోరుమోటార్లకు అవసరమైన చోట మరమ్మత్తులు చేశారా తెలుసుకున్నారు. అదేవిధంగా ఓవర్‌హెడ్ ట్యాంకులపై మూసి ఉంచేలా మూతలు ఉంచాలని ఎక్కడా కూడ నీటికాలుష్యం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ముందస్తు చర్యలు చేపట్టాం..

అనంతరం కలెక్టర్ బీఎం సంతోష్ మాట్లాడుతూ మిషన్‌భగీరథ బల్క్‌వాటర్ సప్‌లైకు ఎలాంటి సమస్య లేదని జిల్లాలో ఉన్న నాలుగు మున్సిపాలిటీలు, 255 గ్రామ పంచాయతీలకు అవసరమైన మేరకు నీటిని సరఫరా చేయడం జరుగుతుందన్నారు. గ్రామస్థాయి నుంచి మండలస్థాయి, మున్సిపాలిటీలలో ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులతో నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తూ.. నీటిఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అపూర్వ్‌చౌహాన్, మిషన్‌భగీరథ ఎస్ఈ జగన్‌మోహన్, ఈఈలు శ్రీధర్‌రెడ్డి, భీమేశ్వర్‌రావు, డీఆర్డీవో నర్సింగ్‌రావు, ఇంచార్జీ డీపీవో వెంకట్‌రెడ్డి, డీఈలు, ఏఈలు, మున్సిపల్ కమీనర్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.



సమీక్షకు హాజరైన అధికారులు

ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం

జిల్లాలో ఇసుక అక్రమ రవాణను అరికట్టేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయంలో ఇసుక అక్రమ రవాణాపై ఎస్పీ రితిరాజ్‌తో కలిసి అధికారులతో టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఇసుక అక్రమ రవాణాపై రెవెన్యూ, పోలీసు, మైనింగ్ అధికారులు సమన్వయం చేసుకుని కఠిన చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా ప్రత్యేకంగా కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ఇసుక రీచ్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా ఉంచి నిరంతరం వాహనాల తనిఖీ జరపాలన్నారు. ఇసుక అక్రమ రవాణా చేసేవారిపై కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు చేపట్టాలన్నారు. దీంతో పాటు వాహనాలను సీజ్ చేసి వాటిపై జరిమానా విధించాలన్నారు. సమావేశంలో ఆర్డీవో రాంచందర్, అదనపు ఎస్పీ గుణశేఖర్, డీఎస్పీ సత్యనారాయణ, మైనింగ్ ఏడీ రమణ, డీజీడబ్ల్యువో మోహన్, తహసీల్దార్లు మంజుల, హరికృష్ణ, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది కలిగించొద్దు

ధరూరు: పంటలకు అవసరమయ్యే ఎరువులు, పిచికారీ మందులు తీసుకునేందుకు వచ్చే రైతులకు ఇబ్బంది కలిగించవద్దని జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్ ఫర్టిలైజర్ డీలర్లకు సూచించారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 5 రకాల ఎరువుల మందులను పరిశీలించడంతో పాటు స్టాక్ వివరాలు తెలుసుకున్నారు. ప్రధానంగా అవసరమయ్యే డీఏపీ, యూరియాను రైతులకు అందించాలని, ఇబ్బందులకు గురి చేస్తే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా రికార్డులను, గోదాములను పరిశీలించారు.



ధరూరులోని ఓ ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న డీఏఓ గోవింద్ నాయక్

కాంగ్రెస్ పథకాలకు గ్యారంటీ లేదు



మాట్లాడుతున్న డీకే అరుణ

గద్వాల రూరల్: కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ పథకాలకు గ్యారంటీ లేదని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో నియోజకవర్గ ముఖ్యనేతల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన వివిధ రకాల సంక్షేమాభివృద్ధి పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అసెంబ్లీ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరుగ్యారంటీ పథకాలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందని ఇదే విషయాన్ని ప్రజలకు వివరించి కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలు, నేతల ప్రకటనలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలన్నారు. కాంగ్రెస్ అసమర్థ పాలనలో కరువు, నీటి, కరెంటు కష్టాలు ఏర్పడ్డాయని చెప్పారు. పార్లమెంట్ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌ను గెలిపించే బాధ్యతను ప్రతిఒక్కరు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వనపర్తి జెడ్పీ చైర్‌పర్సన్ లోక్‌నాథ్ రెడ్డి, పార్టీ నాయకులు రాంచంద్రారెడ్డి, అయ్యంగారి ప్రభాకర్, విష్ణువర్ధన్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, రామాంజనేయులు, బలిగెర శివారెడ్డి, మాలిమ్ ఇసాక్, కృష్ణవేణి, బీమ్లానాయక్ పాల్గొన్నారు.

పాలకుడిలా కాదు.. సేవకుడిలా పనిచేస్తా



మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, చిత్రంలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, మర్రి జనార్దన్‌రెడ్డి

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

నాగర్‌కర్నూల్: తనను ఎంపీగా గెలిపిస్తే, పాలకుడిగా కాకుండా సేవకుడిగా పనిచేస్తానని నాగర్ కర్నూల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరై ప్రసంగించారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకే తాను ఐపీఎస్ ఉద్యోగాన్ని వదిలి రాజకీయాల్లోకి వచ్చానన్నారు. తన కుటుంబం అంతా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేసిందని వివరించారు. తాను గురుకులా సెక్రెటరీగా బడుగు బలహీన వర్గాల విద్యార్థులలో విద్య అనే దీపాన్ని నింపడం కోసం కృషిచేశానని అన్నారు. అణగారిన వర్గాల విద్యార్థులు తన హయాంలోనే ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించి సృష్టించిన రికార్డు నేటికీ పదిలంగా ఉందన్నారు. అలంపూర్ బిడ్డగా ఈ ప్రాంత ప్రజలకు సేవ చేసుకునే అవకాశం కల్పిస్తారని ఆశిస్తున్నానని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చే అబద్ధపు హామీలు, మ్యానిఫెస్టోలను నమ్మి మోసపోవద్దని కోరారు. వంద రోజుల అబద్దాల కాంగ్రెస్ ప్రభుత్వం.. పదేళ్ల నిజమైన పాలన అందించిన బీఆర్ఎస్ మధ్యే పార్లమెంట్ ఎన్నికల పోటీ ఉందన్నారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రం సస్యశ్యామలం అయ్యిందని గుర్తుచేశారు.

ప్రాంతీయ పార్టీలను మట్టుపెట్టాలనే కుట్ర..

కాంగ్రెస్, బీజేపీలు కలిసి ప్రాంతీయ పార్టీలను మట్టుపెట్టాలని చూస్తున్నాయని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడంతోనే సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. గత వానాకాలంలో సగటు వర్షపాతం కంటే 14 శాతం అదనంగా వర్షాలు పడ్డాయని.. కేసీఆర్ ప్రభుత్వంలోనే కరువు వచ్చిందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. నీళ్ల మంత్రి కనీసం సాగునీటి ప్రాజెక్టులపై సమీక్ష కూడా నిర్వహించలేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీకి ఓటువేసిన పాపానికి నీళ్లు, కరెంటు, పింఛన్, రుణమాఫీ అన్నీ మాయమయ్యాయని విమర్శించారు. నార్లాపూర్ రిజర్వాయర్ నుంచి గుడిపల్లి వరకు సాగునీరందించిన ఘనత కేసీఆర్‌దేనని అన్నారు. రాష్ట్ర ప్రజల స్థూల ఆదాయం పెంచినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి, మంత్రులు నోటికొచ్చినట్లు మాట్లాడటం మానుకొని, దమ్ముంటే లెక్కలతో చర్చకు రావా లని సవాల్ విసిరారు. రాహుల్‌గాంధీ ఉత్తరాధి రాష్ట్రాలకు వెళ్లి మోదీని తిట్టాలికాని.. తెలంగాణకు వచ్చి కేసీఆర్‌ను తిడితే ప్రధాని అవుతారా అని ప్రశ్నించారు. కేవలం 1.8 శాతం ఓట్ల తేడాతోనే బీఆర్ఎస్ ఓటమి పాలైందని.. పార్లమెంట్ ఎన్నికల్లో ఆర్ఎస్‌పీ గెలుపునకు కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

సాగు, తాగునీళ్లు అందించడంలో విఫలం..

ప్రజలకు సాగు, తాగునీళ్లు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి విమర్శించారు. కందనూలు చెరువు ఎండిపోవడానికి కారణం.. కాంగ్రెస్ అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలే అని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపునకు అవసరమైతే పాదయాత్ర చేస్తానని చెప్పారు. కాగా, సమావేశంలో మర్రి జనార్దన్‌రెడ్డి ఆసక్తికర కామెంట్స్ చేశారు. బీఆర్ఎస్‌ను మళ్లీ టీఆర్ఎస్ చేయాలని కేసీఆర్‌కు చెప్పినట్లు పేర్కొన్నారు.జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి, గువ్వల బాలరాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బావిలోపడి బాలుడు మృతి

గద్వాల క్రైం: ప్రమాదవశాత్తు బావిలో పడి బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని శెట్టిఆత్మకూర్‌లో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ఇలా.. మల్దకల్ మండలం ఎల్కూర్ చెందిన కృష్ణవేణి, వెంకట్రాములు దంపతులు సోమవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలసి శెట్టిఆత్మకూర్‌లోని నర్సింహస్వామి దేవాలయంలో మొక్కుబడులు తీర్చుకునేందుకు వచ్చారు. వారి కుమారుడు సంతోష్ (14) గుడి సమీపంలో బావిలో ఈత కొట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందాడు. స్థానికులు బాలుడిని కాపాడే ప్రయత్నం చేసినప్పటికి ఫలితం లేకపోయింది. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యాంతమయ్యారు.

ఉరేసుకుని వ్యక్తి బలవన్మరణం


అల్లాజి (ఫైల్)

చారకొండ: ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకోని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన చారకొండ మండలం గోకారంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గోకారం గ్రామానికి చెందిన బాదగోని అల్లాజి(50) హైదరాబాద్‌లో ఆటో నడుపుకుంటు జీవనం సాగిస్తున్నాడు. కొన్ని రోజులుగా గ్రామంలోనే ఉంటున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు లుంగీతో ఉరేసుకోని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయం తెలిసిన వెంటనే ఎస్‌ఐ రాజశేఖర్ ఘటనా స్థలానికి చేరుకోని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి మార్చ్యురీకి తరలించారు. అల్లాజికి భార్య మల్లమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఇటీవల మద్యానికి బానిసైన ఇంట్లో గొడవ పడుతుండేవాడని, క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పురుగుల మందుతాగి మరో వ్యక్తి..


బిరుదు లక్ష్మయ్య(ఫైల్)

తెలకపల్లి: పురుగుల మందు తాగి వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం మండల పరిధిలో చోటు చేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ నారాయణ వివరాల ప్రకారం.. మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన బిరుదు లక్ష్మయ్య(45) కుటుంబ కలహాల వల్ల ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. చుట్టు పక్కల వారు గుర్తించి వెంటనే 108కు సమాచారం అందించి, అనంతరం నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. కుమారుడు రవికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు

పెద్దకొత్తపల్లి: దేవినేనిపల్లి చెందిన కుర్మయ్య(60) ఆదివారం గుంటిముడుగులో నీళ్ల తాగేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి మడుగులోపడి మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ కురుమయ్య తెలిపారు.

వేధింపుల పర్వం

పీయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్‌పై వీసీ, రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేసిన కాంట్రాక్టు అధ్యాపకులు


ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్‌పై వీసీ, రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేస్తున్న పీయూ కాంట్రాక్టు అధ్యాపకులు

- ఆఫ్ట్రాల్ కాంట్రాక్టు ఉద్యోగులు అని బెదిరింపులు
- ప్రాక్టికల్స్‌కు కెమికల్స్, స్టేషనరీ ఇవ్వడం లేదని, వేతనాల్లో కోత విధిస్తున్నారని ఆరోపణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ సుజాత వేధిస్తున్నారని టీచింగ్ సిబ్బంది పీయూ వైస్‌చాన్స్‌లర్ లక్ష్మీకాంత్ రాథోడ్, రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డికి సోమవారం ఫిర్యాదు చేశారు. ఎవరైనా సిబ్బందికి ప్రిన్సిపల్‌కు ఎదురు మాట్లాడితే 'ఆఫ్ట్రాల్ కాంట్రాక్టు ఉద్యోగులు.. తొలగిస్తామని' బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. గతంలోనూ ఒక నాన్ టీచింగ్ సిబ్బంది ఎదురు మాట్లాడాడని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి వేధించడంతో విధుల నుంచి తప్పుకుని ఇంటి వద్ద ఇతర పనులకు వెళ్తున్నాడని వాపోయారు. వెంటనే తమకు న్యాయం చేసి, ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని సిబ్బంది కోరుతున్నారు. దీంతో స్పందించిన పీయూ అధికారులు వెంటనే గ్రీవెన్స్ సెల్ కమిటీ ద్వారా విచారణకు ఆదేశించినట్లు తెలిసింది.

ఏపీ నుంచి డిప్యుటేషన్..

సదరు ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఏపీలోని కృష్ణా యూనివర్సిటీలో అధ్యాపకురాలిగా చేరి అక్కడి నుంచి 2019లో పైరవీపై పీయూకు డిప్యుటేషన్‌పై వచ్చి విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆమె కంటే ముందు నుంచి విధులు నిర్వహిస్తున్న వారిపై వేధింపులకు దిగడం పట్ల సిబ్బంది తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయితే ఆమెకు పీయూ అధికారులు అంతర్గత నిధుల నుంచి వేతనం చెల్లిస్తున్నట్లు సమాచారం. దీంతో పీయూపై ఆర్థిక పరమైన ఒత్తిడి పడుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో ఒక యూనివర్సిటీలో రెగ్యులర్ అధ్యాపకులుగా చేరితే తెలంగాణలో మరో యూనివర్సిటీకి డిప్యుటేషన్‌పై వెళ్లడం కష్టం.. కానీ, ఒక రాష్ట్రంలో విధుల్లో చేరి మరో రాష్ట్రంలో విధులు నిర్వహిస్తున్నారంటే బలమైన కారణం ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది.

సిబ్బందికి ఇబ్బందులు..

విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ శిబిరానికి వెళ్లేందుకు ఒక్కో యూనిట్‌కు ప్రభుత్వం రూ.58 వేలు కేటాయిస్తుంది. అయితే ప్రిన్సిపల్ ఈ విద్యా సంవత్సరం ఎన్ఎస్ఎస్ యాక్టివిటీస్ అవసరం లేదని చెప్పి చెక్కులపై సంతకాలు పెట్టనందుకు రూ.1.16 లక్షలు వెనక్కి వెళ్లిపోయాయని ఆరోపించారు.

- విద్యార్థులు పాక్టికల్స్ చేసేందుకు అవసరమైన కెమికల్స్, స్టేషనరీ ల్యాబ్‌లో అందుబాటులో ఉంచకుండా నేరుగా ఒక రూంలో పెట్టి తాళం వేసుకుంటున్నారు. దీంతో విద్యార్థులు ప్రాక్టికల్స్ చేయడం లేదని అధ్యాపకులు పేర్కొన్నారు.
- ప్రధానంగా సిబ్బందిని గత ఏడేళ్ల ఐటీ రిటర్న్స్ ఇవ్వాలని వేధింపులకు పాల్పడుతున్నారు. అలాగే పరీక్షలకు స్క్వాడ్ అధికారులుగా డ్యూటీలు వేయడం లేదని చెబుతున్నారు.
- తనకు అనుకూలంగా ఉన్న వారికి సీఎల్ లేకున్నా వేతనాలు ఇవ్వడం, వ్యతిరేకంగా ఉన్న వారికి వేతనాలు తగ్గించినట్లు సిబ్బంది పేర్కొంటున్నారు.
- అధ్యాపకులకు స్పెషలైజేషన్ సబ్జెక్టుల్లో తరచుగా మార్పు చేసి బోధించాలని ఒత్తిడి చేయడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

విచారణ జరుపుతాం..

పీయూ ఫార్మసీ ప్రిన్సిపాల్‌పై వచ్చిన ఆరోపణలపై వెంటనే గ్రీవెన్స్‌సెల్ కమి టీ ద్వారా విచారణ జరిపిస్తాం. ఆ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటాం. సదరు ప్రిన్సిపాల్ 2019లో ఐదేళ్ల కాలానికి డిప్యుటేషన్‌పై పీయూకు వచ్చారు.
– మధుసూదన్‌రెడ్డి, పీయూ రిజిస్ట్రార్

న్యాయం చేయాలి..



పీయూ అధ్యాపకులు ఉద్యోగాల పట్ల భద్రతా భావం లేకుండా, తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారు. వారిని ప్రిన్సిపాల్ వేధించడం సరైంది కాదు. గతంలో వేతనాల్లో కోత విధిస్తే సంఘం తరఫున కలిసి విన్నవించాం. కానీ, ప్రిన్సిపాల్ దురుసుగా సమాధానం చెప్పారు. వెంటనే పీయూ ఉన్నతాధికారులు స్పందించి సిబ్బందికి న్యాయం చేయాలి.
– శేకుంటి రవికుమార్, కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు

ఐటీ రిటర్న్స్ అడిగారు..



డిప్యుటేషన్‌పై వచ్చిన ప్రిన్సిపాల్ గతంలో ఎన్నడూ లేని విధంగా ఐటీ రిటర్న్స్' ఇవ్వాలని అడిగారు. ఎందుకు అని అగిడితే సమాధానం చెప్పలేదు. వీటితోపాటు సిబ్బంది వేతనాలు తగ్గించడం, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ డ్యూటీలు వేయకపోవడం వంటివి చేస్తున్నారు. అధికారులు స్పందించి సమగ్ర విచారణ జరిపించాలి.
– రవికాంత్, పీయూ ఫార్మసీ కళాశాల అధ్యాపకులు

ఉద్యోగం మానేశా..



గతంలో నేను పీయూలో ఫార్మసీ కళాశాలలో నాన్ టీచింగ్ సిబ్బందిగా పని చేశా. అయితే నాకు పరీక్షల విధులకు సంబంధించిన వేతనాలు ఇవ్వాలని ప్రిన్సిపాల్‌ని అడిగితే ఉన్నతాధికారులకు అకారణంగా ఫిర్యాదు చేసింది. అలాగే ఒకనెల వేతనం ఇవ్వలేదు. పరీక్షల విధులకు సంబంధించి వేతనం ఇవ్వలేదు. అంతేకాకుండా వేరే చోటుకు బదిలీ చేశారు. దీంతో తట్టుకోలేక ఉద్యోగం మానుకుని ఇంటి వద్ద చిన్నా చితక పనులు చేసుకుంటున్నా.
– రవీందర్‌జీ, మాజీ ఉద్యోగి

వాస్తవాలు తెలుసుకోవాలి..

నా మీద ఫిర్యాదు చేసిన వారు ఏయే అంశాల మీద చేశారో నాకు తెలియదు. కానీ, వాస్తవాలు తెలుసుకోకుండా వార్తలు రాస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. అన్ని అంశాలు తెసుకున్నాకే రాయాలి. ఎవరో స్టేట్‌మెంట్ ఇస్తే రాయడం సరికాదు.
– సుజాత, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్

కురుమూర్తి వాసా గోవిందా


కురుమూర్తి స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

చిన్నచింతకుంట: తెలంగాణ ప్రజల ఆరాధ్య దైవమైన అమ్మపురం కురుమూర్తి స్వామి దర్శనానికి అమావాస్యను పురస్కరించుకొని సోమవారం భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి సుప్రభాత సేవ నిర్వహించిన అనంతరం భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు ఉదయం నుంచే క్యూలైన్లో నిల్చున్నారు. తల స్నానాలు ఆచరించి తడి దుస్తులతో మెట్లపై దీపాలు వెలిగిస్తూ... కురుమూర్తి వాసా గోవిందా అంటూ స్వామివారిని వేడుకున్నారు. కొండ దిగువన మట్టికుండలో పచ్చిపులుసు అన్నం నైవేద్యంగా తయారు చేసి స్వామికి సమర్పించారు. అదేవిధంగా కొండపైన అలివేలు మంగమ్మ, చెన్నకేశవస్వామి, ఆంజనేయ స్వామి, ఉద్దాల మండపం వద్ద భక్తులు రద్దీ కొనసాగింది.

ఇథనాల్ బాధిత రైతులపై రౌడీ షీట్‌లా..

- 18న హైదరాబాద్‌లో రౌండ్ టేబుల్ సమావేశం
- కంపెనీని ఎత్తివేసే వారికే, ఈ సారి ఆ గ్రామాల ఓట్లు
- ఇత్తనూర్ ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకుడు రాఘవాచారి


కరపత్రాన్ని విడుదల చేస్తున్న ఇత్తనూర్ ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): చిత్తనూర్ ఇథనాల్ కంపెనీని వ్యతిరేక పోరాటంలో లాఠీ దెబ్బలు తిన్న రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వం రౌడీ షీట్ కేసులు పెట్టడం దుర్మార్గమని ఇత్తనూర్ ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకుడు రాఘవాచారీ, టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్ మండిపడ్డారు. సోమవారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 2023 అక్టోబర్ 22న జరిగిన అక్రమ లాఠీ చార్జీపై జుడీషియల్ విచారణ జరిపి కారకులైన పోలీస్ అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చిత్తనూర్ ఇథనాల్ కెంపనీ ఆక్రమించిన 20 వేల ఎకరాల అసైన్డ్ భూమిని తిరిగి రైతులకు ఇవ్వాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న 20 ఇథనాల్ కంపెనీలను వెంటనే ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తెచ్చిన ఇథనాల్ పాలసీని వెంటనే ఉపసంహరించాలని కోరుతూ ఈ పాలసీ తీసుకొచ్చిన బీజేపీకి, బాధిత రైతులపై రౌడీషీట్ కేసులు పెట్టించిన కాంగ్రెస్ పార్టీకి, ఈ కంపెనీ యాజమాన్యానికి వత్తాసు పలికిన బీఆర్ఎస్ పార్టీలకు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు వేయవద్దని పిలుపునిచ్చారు. సుమారుగా 3 సంవత్సరాలుగా కంపెనీకి వ్యతిరేకంగా బాధితులు పోరాటం చేస్తున్నారని, అధికారులు కంపెనీకి వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. ప్రజల తరఫున నిలవాల్సిన ప్రభుత్వం, అత్యంత కాలుష్య భరితమైన ఇథనాల్ కంపెనీని పెట్టించడం సరికాదన్నారు. చిత్తనూర్, ఎక్లాస్‌పూర్, జిన్నారం, కన్మనూర్ తదితర గ్రామాల రైతులపై, ఉద్యమ నాయకత్వంపై బనాయించిన అక్రమ కేసులను, రౌడీ షీట్‌ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 18న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమానికి ప్రజాస్వామికవాదులు, ప్రజా సంఘాల నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం రౌండ్ టేబుల్ సమావేశం కరపత్రాన్ని విడుదల చేశారు. సమావేశంలో నాయకులు లక్ష్మణ్, రాంచంద్రయ్య పాల్గొన్నారు.

వివాహిత దారుణ హత్య

- వివాహేతర సంబంధమే కారణం
- పోలీసులకు లొంగిపోయిన నిందితుడు


చిట్టెమ్మ (ఫైల్)


నిందితుడు శివకుమార్


పంచనామా నిర్వహిస్తున్న పోలీసులు

బిజినేపల్లి: మండలంలోని వెల్గొండ శివారు కల్వకుంటతండాకు చెందిన చిట్టెమ్మ (28) ఆదివారం రాత్రి దారుణ హత్యకు గురైంది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని వట్టెం గ్రామం కల్వకుంటతండాకు చెందిన మోతి కుమార్తె చిట్టెమ్మకు ఖిల్లాఘనపురం మండలం మామిడిమాడకు చెందిన రమేష్‌తో వివాహం జరిగింది. కాగా వారు కొద్ది రోజులుగా బిజినేపల్లిలో ఉంటున్నారు. వారిద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో చిట్టెమ్మకు మండల కేంద్రానికి చెందిన శివకుమార్‌తో వివాహేతర సంబంధం ఏర్పడింది. రమేష్‌కు అనుమానం రావడంతో తమ మకాంను జడ్చర్లకు మార్చారు. ఆదివారం సాయంత్రం చిట్టెమ్మ తిమ్మాజీపేటకు రాగా.. శివకుమార్ ఆమెను వెల్గొండ శివారులో కౌలుకు తీసుకున్న వ్యవసాయ పొలానికి తీసుకెళ్లాడు. వారిద్దరి మధ్య గొడవ చెలరేగడంతో శివకుమార్ చిట్టెమ్మ గొంతు నులిమి చంపేసి మృతదేహాన్ని పక్కనే ఉన్న పత్తి కట్టె కుప్పలో మూసి ఉంచాడు. భయంతో సోమవారం ఉదయం శివకుమార్ పోలీసులకు లొంగిపోయి చేసిన ఘాతుకాన్ని వివరించాడు. డీఎస్పీ శ్రీనివాస్, సీఐ కనకయ్యగౌడ్, బిజినేపల్లి ఎస్ఐ నాగశేఖర్‌రెడ్డి, తిమ్మాజీపేట ఎస్ఐ నరేందర్ రెడ్డి ఘటనా స్థలానికి పరిశీలించి పంచనామా నిర్వహించి మృతదేహాన్ని నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ముమ్మరంగా తనిఖీలు.. నగదు పట్టివేత


బాలానగర్‌లో పట్టుబడిన నగదు


చారకొండలో..


నందిన్నె చెక్‌పోస్టు వద్ద..

చారకొండ: మండల కేంద్రంలో సోమవారం ఎస్‌ఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో కేజీబీవీ పాఠశాల వద్ద రూ.2.32లక్షలు పట్టుకున్నట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. యాచారం మండలం, తమ్మలోనిగూడెంకు చెందిన పాల కృష్ణ డీసీఎంలో వాహనంలో మాల్ నుంచి డిండికి నగదు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. అందుకు సంబంధించి ఎలాంటి రశీదులు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

బాలానగర్: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టులో సోమవారం పోలీసులు రూ.76 వేల నగదును పట్టుకున్నారు. కర్నూల్ జిల్లా వెల్దుర్తి మండలం తిమ్మాపూర్ చెందిన నాగేష్ హైదరాబాద్ నుంచి కర్నూల్ వెళ్తుండగా, వాహనాల తనిఖీల్లో నగదును పట్టుకున్నట్లు ఎస్‌ఐ తిరుపాజీ తెలిపారు.

కేటీదొడ్డి: మండలంలోని నందిన్నె చెక్‌పోస్టు వద్ద రాయచూర్ నుంచి గద్వాల వైపు వస్తున్న ముగ్గురు వ్యక్తులు వేర్వేరు వాహనాలలో వస్తుండగా వారి నుండి రూ. 2,21,000 నగదును పట్టుకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్‌రావు సోమవారం తెలిపారు.

గోపాల్‌పేట: మండలంలోని బుద్దారం గండి చెక్ పోస్ట్ వద్ద సోమవారం రూ. 64వేలు పట్టుకున్నట్లు ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు. వేముల శివయ్య శానాయిపల్లి నుంచి వనపర్తికి నగదు తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్ వద్ద సోమవారం రాత్రి వాహనాలను తనిఖీ చేస్తుండగా రూ.3.80లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రవి తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి చెందిన తుల్జారాంజీ స్కూటీపై హైదరాబాద్ నుంచి కల్వకుర్తి వైపు వెళ్తుండగా, తనిఖీ చేయగా రూ.3.80లక్షల నగదు లభించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి ఎలాంటి ఆధారం లేకపోవడంతో డబ్బును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

అటవీశాఖ చెక్‌పోస్టు నిబంధనలు సడలింపు


మన్ననూర్‌లోని అటవీశాఖ చెక్‌పోస్టు

మన్ననూర్: శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వెళ్లే భక్తుల విన్నపం మేరకు 11వ తేదీ వరకు మన్ననూర్, దోమలపెంట చెక్‌పోస్టుల నిబంధనలు సడలిస్తున్నట్లు ఫారెస్టు రేంజ్ అధికారి ఆదిత్య సోమవారం తెలిపారు. శ్రీశైలం క్షేత్రంలో భ్రమరాంభిక అమ్మవారి పూర్ణకుంభ ఉత్సవాలకు కర్ణాటక నుంచి భక్తులు ఏటా వేల సంఖ్యలో తరలివస్తారు. ఈ క్రమంలో 9నుంచి 11వ తేదీ వరకు చెక్‌పోస్టుల నుంచి 24 గంటల పాటు వాహనాల రాకపోకలను అనుమతిస్తున్నట్లు తెలిపారు. రాత్రి 9 గంటల తర్వాత ఒక్కొక్కటి కాకుండా కొన్ని వాహనాలను కలిపి వదులుతామని తెలిపారు.

రామన్‌పాడులో తగ్గిన నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో నీటి మట్టం తగ్గుతుంది. ఆదివారం 1,012 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.

ప్రాణం తీసిన మద్యం, డబ్బు తగాదా

- మద్యం కొనుగోలుపై పాత నేరస్తుల మధ్య గొడవ
- తలపై మోదీ.. నిప్పుపెట్టిన వైనం
- సీసీ ఫుటేజీతో హంతకుడి ఆచూకీ లభ్యం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ యోగేష్ గౌతమ్



హత్యకేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట రూరల్: వారిరువురు వేర్వేరు ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడుతూ, పోలీసులకు చిక్కారు. ఒకే జైలులో కొంతకాలం శిక్ష అనుభవించారు. ఈక్రమంలో వారి మధ్య పరిచయం ఏర్పడి.. స్నేహంగా మారింది. కారాగారం నుంచి బయటకు వచ్చిన వచ్చిన వీరి మధ్య నాలుగు రోజుల క్రితం డబ్బు, మద్యం కోసం జరిగిన చిన్నపాటి తగాదా హత్యకు దారితీసింది. ఇందుకు సంబంధించిన వివరాలను సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ యోగేష్ గౌతమ్ వెల్లడించారు. ఆ వివరాలు.. నారాయణపేట పళ్ల వీధికి చెందిన దాసరి నారాయణ, మారుతి సోదరులు. వృత్తిరీత్యా నారాయణ దామరగిద్ద మండలం చాకలివానిపల్లిలో స్థిరపడగా.. మారుతి పొట్టకూటి కోసం హైదరాబాద్‌కు వెళ్లి కూలీ పనులు చేస్తున్నాడు. అదేవిధంగా పట్టణంలోని పళ్ల బుర్జువాడకు చెందిన ఉప్పరి నర్సింహులు అలియాస్ నజీర్ స్థానికంగా కూలీ పని చేస్తుంటాడు. వేర్వేరు ప్రాంతాల్లో ఉంటున్న మారుతి, నర్సింహులు డబ్బుల కోసం దొంగతనాలకు అలవాటుపడ్డారు. ఈక్రమంలో ఇరువురు వేర్వేరుగా చేసిన చోరీల్లో అరెస్టయి, మహబూబ్‌నగర్ జైలులో శిక్ష అనుభవించారు. ఈక్రమంలో ఇరువురికి పరిచయం ఏర్పడింది. జైలు నుంచి బయటకు వచ్చిన వీరు.. స్నేహంగా ఉంటూ అప్పుడప్పుడు కలుసుకుని మద్యం తాగేవారు. ఎప్పటిలాగే ఈనెల 4న సాయంత్రం జిల్లా కేంద్రంలో వారిద్దరు కలుసుకున్నారు. ఇద్దరి డబ్బులతో కొంత మద్యం కొనుగోలు చేసి, స్థానిక పాతగంజ్ ప్రాంతంలో కూర్చొని తాగారు. ఈక్రమంలో చిన్నపాటి గొడవ ప్రారంభమైంది. మద్యం అయినపోయిన తర్వాత మళ్లీ మద్యం కొనుగోలు చేయాలని భావించారు. డబ్బులు నువ్వు ఇవ్వాలంటే.. నువ్వు ఇవ్వాలంటూ మరోసారి గొడవపడ్డారు. దీంతో నర్సింహులు అలియాస్ నజీర్ తెలివిగా మందు తీసుకువద్దామని చెప్పి, జిల్లా ఆస్పత్రి వెనుక నిర్మానుష ప్రాంతానికి మారుతిని తీసుకెళ్లాడు. అక్కడ మరోసారి ఇరువురు గొడవపడ్డారు. ఈక్రమంలో కింద పడ్డ మారుతిపై నర్సింహులు బండరాయితో బలంగా మోదడంతో తీవ్రగాయమై రక్తస్రావమైంది. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న మారుతిపై చిత్తు కాగితాలు, గొర్రె ఉన్ని వేసి నిప్పు పెట్టాడు. తన చొక్కాపై రక్తపు మరకలు ఉండటంతో దాన్ని సైతం ఆ మంటలో వేసి, కేవలం ప్యాంటుపై ఇంటికి వెళ్లాడు.

పోలీసులను ప్రశంసించిన ఎస్పీ..

హత్య కేసును నాలుగు రోజుల్లో చాకచక్యంగా ఛేదించిన పోలీసులను ఎస్పీ యోగేష్ గౌతమ్ అభినందించారు. కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన సీఐ శివశంకర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్లు ఆంజనేయులు, రాములుకు ప్రశంసాపత్రాలు అందజేశారు. నిందితుడిపై గతంలో ఐపీసీ 457, 380, 379 రెడ్ విత్ 511, 379 సెక్షన్ల కింద ఆరు కేసులు నమోదై ఉండగా.. తాజాగా హత్య కేసు చేరుస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.

సోదరుడి ఫిర్యాదుతో..

ఈనెల 5న గుర్తుతెలియని వ్యక్తిని చంపి, నిప్పు పెట్టారనే సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. విచారణ చేపట్టారు. అదే రోజు మృతుడి సోదరుడు నారాయణ వచ్చి, తన తమ్ముడు మారుతిగా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. తమదైన శైలిలో విచారణ ప్రారంభించారు. ఆ మార్గంలోని సీసీ కెమెరా పుటేజీలను పరిశీలించగా.. రాత్రి 11 గంటల సమయంలో మారుతితో కలిసి నర్సింహులు అటుగా వెళ్లినట్లు గుర్తించారు. కొంత సమయం తర్వాత నర్సింహులు షర్టు లేకుండా తిరిగి రావడంతో అనుమానంతో ఆయన ఇంటికి వెళ్లి పరిశీలించారు. ఓ సంచిలో రక్తపు మరకలతో కూడిన ప్యాంటు లభించగా.. నర్సింహులును అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. చేసిన తప్పును ఒప్పుకోవడంతో సోమవారం కోర్టులో హాజరుపర్చగా, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ వెల్లడించారు.